సాక్షి విశాఖపట్నం

బుధవారం । 28 । మే । 2025



దిగుబడి బాగు.. ధర దిగాలు! 8లో



మోడల్ ఎంట్రన్స్ టెస్టులు ఎంతో ఉపయోగకరం 8లో



చెక్ బౌన్స్ కేసులో రియల్ ఎస్టేట్ వ్యాపారికి జైలు 8లో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా డిప్లొమా లేటరల్ ఎంట్రీ ప్రవేశ పరీక్ష



హాల్ టికెట్ నంబర్లు చూస్తున్న విద్యార్థులు

మురళీనగర్: ఇండస్ట్రియల్ ట్రైనింగ్ (ఐటీఐ) పూర్తి చేసి బ్రిడ్జి కోర్సు చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఉత్తరాంధ్రలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో కోర్సు పూర్తి చేసిన 145 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ర్యాంకుల ఆధారంగా డిప్లొమా రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు.

పోర్టులో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ప్రారంభం



ఛార్జింగ్ స్టేషన్లను ప్రారంభిస్తున్న పోర్టు చైర్‌పర్సన్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్టు పరిపాలన భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది గ్రీన్ ఎనర్జీ, సస్టెయినబుల్ ట్రాన్స్‌పోర్ట్ మౌలిక సదుపాయాల ఏర్పాటులో కీలకమైన ముందడుగుగా నిలుస్తోందని తెలిపారు. రెండు డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు, రెండు ఏసీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా ఒకేసారి ఆరు ఎలక్ట్రిక్ వాహనాలను ఛార్జ్ చేయడం సాధ్యమవుతుందని వివరించారు.

నేటి నుంచి పాఠశాలల్లో యోగా పోటీలు

విశాఖ విద్య: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో మూడు కేటగిరీల్లో యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ చంద్రశేఖర్ రావు తెలిపారు. గ్రామ స్థాయిలో ప్రతీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో జూనియర్స్(10 నుంచి 18 ఏళ్లు), యూత్ (19 నుంచి 35 ఏళ్లు), సీనియర్స్(35 ఏళ్ల పైబడిన వారు)కు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 2, 3 తేదీల్లో మండల స్థాయి యోగాసన పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయి యోగాసన పోటీలను జూన్ 9, 10 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో నిర్వహించి, విజేతలను ఎంపిక చేస్తామన్నారు. జూన్ 16,17 తేదీల్లో రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు.

31 నుంచి పోస్టాఫీసుల్లో ఆధార్ అనుసంధానం

మహారాణిపేట: ఆధార్ అనుసంధానం కోసం జిల్లాలోని అన్ని పోస్టల్ కార్యాలయాల్లో ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న సంక్షేమ పథకాలకు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరని పేర్కొన్నారు. ఇండియా పోస్ట్ పేమెంటు బ్యాంక్(ఐపీపీబీ) అకౌంట్‌తో ఆధార్ అనుసంధానం జరిగిన తర్వాత పథకాల ద్వారా జమయ్యే నగదును ఏ పోస్టాఫీసులో అయినా తీసుకోవచ్చన్నారు. ఫోన్ పే, గూగుల్ పే వంటి యాప్‌లకు లింక్ చేసి ఎన్ఎఫ్ఈటీ, ఐఎంపీఎస్, యూపీఐ లావాదేవీలు చేయవచ్చని పేర్కొన్నారు. ఆధార్ ఐపీపీబీ అకౌంట్ లింకేజ్(ఎన్‌పీసీఐ మ్యాపింగ్) చేయని వారు, తమ దగ్గరలోని పోస్టాఫీసులో సంప్రదించాలన్నారు.

20 మందికి కారుణ్య నియామక పత్రాలు

మహారాణిపేట: కారుణ్య నియామకాల కింద 20 మందికి నియామక పత్రాలను కలెక్టర్ హరేందిర ప్రసాద్ అందజేశారు మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లుగా, కార్యాలయ సహాయకులుగా నియమితులైన వారికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భవానీ శంకర్, పరిపాలన అధికారి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లబ్బుతో గలీజు ఆట!

గెస్టులతో పేకాట నిర్వహణ

- కేసులు లేకుండా చూసుకుంటానని హామీ
- నెలవారీ మామూళ్లు ఇవ్వాలని డిమాండ్
- కూటమి ఎమ్మెల్యే బరితెగింపు
- కొద్దిరోజుల క్రితం క్లబ్బుపై టాస్క్‌ఫోర్స్ దాడి
- కేసులు పెట్టకుండా విడిపించిన సదరు ఎమ్మెల్యే
- వాటాల వ్యవహారం తేలిన వెంటనే ప్రారంభించేందుకు సన్నాహాలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

క్లబ్బుతో గలీజు **ఆటను ప్రారంభించారు** ఓ కూటమి ఎమ్మెల్యే. **విశాఖ నగరంలో ఎంతో చరిత్ర** ఉన్న పాత క్లబ్బులో **పేకాటను నిర్వహించుకునేం**దుకు అండదండలు అందించేందుకు ముందుకొచ్చారు. ఇందుకుగానూ తన మనుషులకు క్లబ్బులో పేకాటాడేందుకు అనుమతితో పాటు నెలవారీ మామూళ్లు ఎంత ఇస్తారో తేల్చాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం క్లబ్బులో పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించగా.. కేసులు పెట్టకుండా సదరు ఎమ్మెల్యేనే విడిపించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పోలీసుల నుంచి ఎటువంటి ఇబ్బంది లేకుండా తాను చూసుకుంటానని.. ఇందుకోసం మాముళ్లు ఎంత మొత్తం ఇస్తారో నిర్ణయించుకోవాలని ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. వాటాల వ్యవహారం తేలకపోవడంతో తాత్కాలికంగా పేకాట నిలిచినప్పటికీ త్వరలో **భారీగా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. నిబంధనల మేరకు 50 మంది సీనియర్ సభ్యులు మాత్రమే పేకాట ఆడుకునేందుకు అవకాశం ఉన్న సదరు క్లబ్బులో మరో 200 మందిని గెస్టుల రూపంలో ఆడేందుకు** పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే క్లబ్బులో బార్ నిర్వహణను తన మనిషికి ఇప్పించుకున్న ఎమ్మెల్యే.. మొత్తం క్లబ్‌నే తన ఆధీనంలోకి తీసుకునేలా పథక రచన చేస్తున్నట్టు సమాచారం.

గెస్టుల రూపంలో..!

నిబంధనల మేరకు క్లబ్బులో సభ్యత్వం ఉన్న అత్యంత సీనియర్లు మాత్రమే పేకాట ఆడుకునేందుకు అవకాశం ఉంది. ఈ సంఖ్య సదరు క్లబ్బులో 50 మందికి మించే అవకాశం లేదని తెలుస్తోంది. అయితే క్లబ్బుతో ఎలాంటి సంబంధం లేని 200 మంది వరకూ తన అనుచరులతోపాటు బయటి వ్యక్తులు గెస్టులుగా వచ్చి ప్రతీ రోజూ పేకాట ఆడుకునేందుకు అవకాశం కల్పించాలని సదరు కూటమి ఎమ్మెల్యే కోరుతున్నారు. అంతేకాకుండా



వారి నుంచి రోజుకు ఇంత మొత్తం వసూలు చేసుకోవాలంటూ క్లబ్బు యాజమాన్యానికి సలహా ఇచ్చినట్టు తెలుస్తోంది. వాస్తవానికి సదరు క్లబ్బులో అప్పటికే సీనియర్ సభ్యులు కానీ వారు కూడా పేకాటాడుతున్న వ్యవహారంపై కొద్దిరోజుల క్రితం నేరుగా కొందరు పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసు సిబ్బందితో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి కొద్ది మందిని స్టేషన్‌కు తీసుకెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే సదరు ఎమ్మెల్యే ఒత్తిడి తీసుకొచ్చి ఎటువంటి కేసులు నమోదు కాకుండా వారిని పోలీసు స్టేషన్ నుంచి బయటకు తీసుకొచ్చినట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. అయితే గత మూడు రోజులుగా నిలిచిన పేకాట వ్యవహారాన్ని తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా నెలవారీగా తనకు ఇంత మొత్తం ముట్టచెప్పేలా క్లబ్బు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం తేలిన అనంతరం క్లబ్బు పేకాటతో కళకళలాడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్లబ్బులో బార్‌పై కన్ను..!

ఎంతో చరిత్ర ఉన్న సదరు క్లబ్బులో ఇప్పటికే తిష్టవేసిన సదరు ఎమ్మెల్యే.. అక్కడి వ్యాపారాన్ని కూడా తన ఆధీనంలోకి తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా క్లబ్బులోని బార్ నిర్వహణను తన అనుచరుడి పేరుతో చేతిలోకి తీసుకున్నారు. అంతేకాకుండా క్లబ్బులో గౌరవనీయ పోస్టులో తిష్టవేసిన సదరు ఎమ్మెల్యే.. క్రమంగా క్లబ్బును తన ఆధీనంలోకి తీసుకునేందుకు నిర్ణయించుకున్నారు. ఇప్పటికే బార్ నిర్వహణను తీసు**కున్న ఎమ్మెల్యే.. పేకాట** నిర్వహణలో కూడా **వాటా తనకు దక్కాలని** స్పష్టంగా తేల్చిచెప్ప**డంతో పాటు పేకాటకు** కూడా తన మను**షులు ప్రతీరోజూ వచ్చి ఆడు**కుంటారని కూడా **యాజమాన్యానికి స్పష్టం** చేసినట్టు సమాచారం. **ఇక నెలవారీ మామూళ్ల** వాటా కుదిరిన **వెంటనే క్లబ్బులో ఏకంగా** 250 మందితో నగ**రంలోనే అతి పెద్ద పేకాట** డెన్‌ను నడిపేందుకు **సిద్ధమవుతున్నారు. మరోవైపు** క్లబ్బులో ఇన్ని **రోజులుగా ఎటువంటి** లెక్కాపత్రం చూపకుం**డా సోలో యజమానిగా** ఉన్న యాజమాన్యం **లోని ఓ వ్యక్తి కూడా** ఎమ్మెల్యే ఆదేశాలకు అను**గుణంగా** నడుచుకుంటున్నారనే విమర్శలు**న్నాయి. ఇద్దరూ కలిసి క్లబ్బు**ను గలీజు వ్యవహారంగా మారుస్తున్నారని సీనియర్ సభ్యులు వాపోతున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో యోగా దినోత్సవ ఏర్పాట్లు



ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఎం.టి.కృష్ణబాబు

మహారాణిపేట: వచ్చే నెల 21న విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగా దినోత్సవ ఏర్పాట్లపై ఆయన మంగళవారం కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి కంపార్టుమెంట్ వద్ద అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. కంపార్టుమెంట్ లోపలికి వచ్చే వారిని వలంటీర్ల సాయంతో సాంకతిక పరికరాలను ఉపయోగించి లెక్కించాలని, దానికి ముందుగా ప్రతి ఒక్కరికీ క్యూఆర్ కోడ్లను అందించాలని సూచించారు. దీనికి ముందు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీర పాండియన్, ఆయుష్ డైరెక్టర్ దినేశ్‌కుమార్‌లతో కలిసి ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు కార్యక్రమం జరిగే వివిధ ప్రాంతాలను పరిశీలించారు.


వచ్చే నెల 19న ఫుల్ డ్రెస్ రిహార్సల్

జూన్ 19న ఫుల్ డ్రెస్ రిహార్సల్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రధాన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి రోజూ ఒక గంట యోగా ప్రాక్టీస్ చేయించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన చర్యల గురించి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ పీపీటీ సాయంతో వివరించారు. కార్యక్రమంలో డీఐజీ గోపీనాథ్ జెట్టీ, డీసీపీ అజిత, వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫైలు కదలాలంటే పైసలివ్వాల్సిందే!

వీఎంఆర్‌డీఏలో ఎక్కడి ఫైళ్లు అక్కడే..

- లేఅవుట్ల అనుమతికి ముప్పతిప్పలు
- ఎకరాకు ఇంత అని ముట్టజెప్పాల్సిందే..
- ఇంజనీరింగ్‌లో పర్సంటేజీలు
- అకౌంట్స్‌లోనూ అదే తీరు..
- కాంట్రాక్టులను పంచుకుంటున్న అధికారులు



విశాఖ సిటీ: అక్కడ ఫైలు కదలాలంటే పైసలివ్వాల్సిందే. లేదంటే వారాలు, నెలలు గడిచినా ముందుకు కదలదు. ఈ విభాగం.. ఆ విభాగం.. అని తేడా లేదు. అన్నింట్లోను అదే పరిస్థితి. ఎక్కడైనా.. ఏ పనికైనా మామూళ్లు ముట్టజెప్పాల్సిందే. లేదంటే లేఅవుట్లకు అనుమతులు రావు. ఇంజనీరింగ్‌లో బిల్లులు మంజూరు కావు. అకౌంట్స్‌లో చెక్కులు అవ్వవు. ఇదీ విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీఎంఆర్‌డీఏ)లో దుస్థితి. ప్లానింగ్, ఇంజనీరింగ్, అకౌంట్స్, ఫారెస్ట్ ఇలా ఏ విభాగంలో పని పూర్తి కావాలన్నా అధికారుల చేతులు తడపాల్సిందే అన్నది బహిరంగ రహస్యమే.

అంతా 'ప్లానింగ్' ప్రకారమే..

వీఎంఆర్‌డీఏలో అంతా ఒక 'ప్లానింగ్' ప్రకారమే చక్కబెట్టేస్తున్నారు. సంస్థ పరిధిలో లేఅవుట్ల అభివృద్ధి కోసం రియల్ ఎస్టేట్ సంస్థలు ప్లానింగ్ విభాగంలో దరఖాస్తులు చేస్తాయి. వీటికి అనుమతులు ఇవ్వాలంటే విభాగంలో పలువురి చేతులు తడపాల్సిందే. ఫైలు కదలాలంటే ఎకరాకు ఇంత అని అనధికార చెల్లింపులు చదివించుకోవడం ఆనవాయితీగా మారిపోయింది. విస్తీర్ణం, ప్రాంతాన్ని బట్టి ఈ రేటు మారుతూ ఉంటుంది. ప్లానింగ్ ఆఫీసర్ నుంచి సర్వేయర్ వరకు అంతా ఏకమైపోతారు. డబ్బులు ముట్టిన ఫైళ్లను మాత్రమే క్లియరెన్స్‌కు పంపుతారు. రేటు నిర్ణయం కాని వాటిని ముట్టుకోరు. ఒకవేళ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువు దాటిన తరువాత వాటికి ఆటోమేటిక్‌గా అనుమతి లభించినప్పటికీ.. కొర్రీలు వేస్తూ ముప్పతిప్పలు పెడతారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించింది. దీంతో వీఎంఆర్‌డీఏ పరిధిలో కొత్త లేఅవుట్లకు దరఖాస్తులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం మూడు వరకు మాత్రమే లేఅవుట్ల కోసం దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇవి ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి.

అకౌంట్స్‌లో చెక్కులకు మామూళ్లు

సంబంధిత విభాగాల్లో అధికారుల ఆమోద ముద్ర తరువాత ఫైళ్లు చివరిగా పేమెంట్ కోసం అకౌంట్స్ విభాగానికి వెళతాయి. అక్కడ ఒక కాంట్రాక్టర్ల బిల్లులే కాకుండా వీఎంఆర్‌డీఏ చేసే చెల్లింపులన్నింటికీ శల్యపరీక్షలు జరుగుతాయి. ఈ విభాగంలో బిల్లుల చెల్లింపులకు జాప్యం సర్వసాధారణమన్న టాక్ వినిపిస్తోంది. చెక్కులు చేతికందాలంటే మామూళ్లు సమర్పించుకోవాలన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు అటవీ విభాగంలో కూడా పనుల కేటాయింపులో అవకతవకలు జరుగుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. సిబ్బందిలోనే కొందరు బినామీ కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేజిక్కించుకుని భారీగానే వెనకేసుకుంటున్నారని విభాగం సిబ్బందే చెవులు కొరుక్కుంటున్నారు. ఇలా వీఎంఆర్‌డీఏలో ఒక్కో విభాగంపై ఒక్కో రకమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పర్సంటేజీల్లో కింగ్.. ఇంజనీరింగ్


వీఎంఆర్‌డీఏలో ఇంజనీరింగ్ విభాగం అత్యంత కీలకం. రూ.వందల కోట్లతో జరిగే పనులను ఈ విభాగమే పర్యవేక్షిస్తుంది. దీంతో ఈ విభాగంలో పోస్టింగ్‌లకు భలే గిరాకీ ఉంది. జగనన్న లేఅవుట్ల అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ రహదారులు, ది డెక్ వాణిజ్య సముదాయం.. ఇలా అనేక భారీ ప్రాజెక్టు పనులను ఈ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అలాగే మౌలిక సదుపాయాల పనులను రూ.వందల కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో చేపడుతున్నారు. వీటితో పాటు వీఎంఆర్‌డీఏ మ్యూజియాలు, పర్యాటక కేంద్రాల నిర్వహణ, నిర్మాణ టెండర్లతో బిజీగా ఉన్నారు. టెండర్లు దక్కించుకున్న నాటి నుంచి కాంట్రాక్టర్లకు పర్సంటేజీ బెడద ప్రారంభమవుతుంది. వారు చేసిన పనులన్నీ ఎప్పటికప్పుడు ఫీల్డ్ మెజర్‌మెంట్ పుస్తకంలో నమోదు చేస్తేనే వాటికి బిల్లులు మం



జూరవుతాయి. దీనికి ఇంజనీరింగ్ అధికారులకు పర్సంటేజీలు తప్పనిసరి. లేనిపక్షంలో ఆ బిల్లుల ఫైల్ మాయమైపోతుంది. కాంట్రాక్టర్ ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫైల్ కనిపించదు. పర్సంటేజ్ ఇచ్చిన వెంటనే బిల్లు ఉన్నతాధికారులకు వెళ్లిపోతుంది. ఇదిలా ఉంటే ఇటీవల కాలంలో టెండర్ల వ్యవహారంపై కూడా దుమారం రేగుతోంది. తమ వారికి పనులు అప్పగించేందుకు టెండర్ల సమయంలోనే కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి బెదిరించిన సందర్భాలు ఉన్నాయి.

పార్టీ కోసం పనిచేసే వారికే ప్రాధాన్యం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు



సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో విశాఖ అభివృద్ధికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని, విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటించి ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేశారని ఆ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. పార్టీ అనుబంధ కమిటీల నియామకంపై చేస్తున్న కసరత్తుల్లో భాగంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో కూడా ఉత్తరాంధ్ర, విశాఖపట్నం ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. విశాఖకు జగన్, వైఎస్సార్ ఎటువంటి మేలు చేశారు.. చంద్రబాబు ఏం చేశారనే విషయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. పార్టీపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. పార్టీకి మొదటి నుంచి అండగా ఉండి, నిజంగా కష్టపడుతున్న వారిని గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. వారి ద్వారానే పార్టీకి భవిష్యత్తులో మేలు జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ.. అందరితో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు.

విశాఖకు అడుగడుగునా అన్యాయం

2014 ఎన్నికల్లో విశాఖను సౌత్ ఇండియాకు గేట్ వేగా అభివృద్ధి చేస్తామని హామీలిచ్చిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక కేవలం అమరావతిపై ప్రేమతో విశాఖపై సవతి ప్రేమ చూపించారని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ప్రకటించి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తే.. తప్పుడు ప్రచారాలు, కేసులతో దానిని అడ్డుకున్నారని పేర్కొన్నారు. మళ్లీ 2024 ఎన్నికల సమయంలో అదే తరహా హామీలిచ్చి, అమరావతి అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, ఉత్తరాంధ్ర అభివృద్ధిని పేపర్లకే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. విశాఖకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని పునరుద్ఘాటించారు. సూపర్ సిక్స్ హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చి.. ఏడాది కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామన్నారు. 2014 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ కోసం ఎంతో మంది కష్టపడ్డారని, అయితే ఎన్నికలు వచ్చే సరికి కొంత మంది న్యూట్రల్ అయిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితి రాకుండా వైఎస్సార్‌సీపీ నా పార్టీ అన్న భావనతో, ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలవాలని మనస్ఫూర్తిగా కోరుకుని పనిచేసే కార్యకర్తలు, నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

గుణుపూర్ పాసింజర్ వేళల్లో మార్పులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం-గుణుపూర్ పాసింజర్ వేళలు జూన్ 1వ తేదీ నుంచి మారుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. తెంబూరు-గుణుపూర్ మధ్య ప్రధానంగా రైళ్ల వేళలు మారాయి. విశాఖ-గుణుపూర్(58506) పాసింజర్ ప్రతీ రోజు ఉదయం 5.30 గంటలకు విశాఖలో బయల్దేరి ఉదయం 9.44 గంటలకు తెంబూరు, 9.49 గంటలకు గంగువాడ, 9.59 గంటలకు పాతపట్నం, 10.08 గంటలకు పర్లాకిముడి, 10.24 గంటలకు సీతాపురం, 10.29 గంటలకు హడ్డుబంగి, 10.39 గంటలకు కాశీనగర్, 10.49 గంటలకు లిహూరి, 10.59 గంటలకు బన్సధార, 11.09 గంటలకు పాలసింగి, 11.55 గంటలకు గుణుపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుణుపూర్-విశాఖపట్నం(58505) పాసింజర్ మధ్యాహ్నం 1.55 గంటలకు బదులుగా 2.30 గంటలకు గుణుపూర్‌లో బయల్దేరి 2.40 గంటలకు పాలసింగి, 2.47 గంటలకు బన్సధార, 2.56 గంటలకు లిహూరి, 3.04 గంటలకు కాశీనగర్, 3.15 గంటలకు హడ్డుబంగి, 3.20 గంటలకు సీతాపురం, 3.33 గంటలకు పర్లాకిముడి, 3.43 గంటలకు పాతపట్నం, 3.52 గంటలకు గంగువాడ, సాయంత్రం 4 గంటలకు తెంబూరు, 4.09 గంటలకు పెద్దసాన, 4.17 గంటలకు టెక్కలి, రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకంటుంది.

జూలో సీడ్ బాల్స్ తయారీ



సీడ్‌బాల్స్‌తో ఎన్‌సీసీ విద్యార్థులు, జూ సిబ్బంది, ఎన్జీవో సంస్థ ప్రతినిధులు



జూలో సీడ్ బాల్ తయారు చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు, జూ సిబ్బంది

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో జూ, గ్రీన్ క్లైమేట్ సంస్థ సంయుక్తంగా మంగళవారం సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహించాయి. ఎన్‌సీసీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సీడ్ బాల్స్ తయారు చేసి జూలోని వివిధ ప్రాంతాల్లో చల్లారు. జూ క్యూరేటర్ మంగమ్మ మాట్లాడుతూ విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచడం అభినందనీయమన్నారు. ఏపీ ఎన్‌సీసీ పదమూడో బెటాలియన్ ఎల్.టి కల్నల్ నీరజ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక వనాల పెంపులో అందరి భాగస్వామ్యం అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిం, సుభేదార్లు మేజర్ శ్రీనివాస్, సుహాస్‌సింగ్, సునీల్‌సింగ్ రవీంద్రసింగ్, సుహాస్ సింగ్, జూ అధికారులు, సిబ్బంది, గ్రీన్ క్లైమేట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరుములు.. మెరుపులు



మహారాణిపేట: నగరంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. రుతుపవనాల తాకిడితోపాటు అల్పపీడనం వల్ల జిల్లాలో పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి ఎండ ప్రభావం చూపినా సాయంత్రం చల్లబడింది. మెరుపులు, ఉరుములతో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో నగరం కూల్ కూల్‌గా మారింది.





ఈసారైనా సక్రమంగా జరిగేనా?

కౌన్సెలింగ్ ద్వారా పంచాయతీ రాజ్ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ

మహారాణిపేట: పంచాయతీరాజ్‌లో ఈసారైనా పారదర్శక బదిలీలు జరిగేనా అన్న అనుమానం కలుగుతోంది. అయితే గత బదిలీల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో, ఈసారి కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. గతంలో ఇంజినీర్లు, మినిస్టీరియల్ ఉద్యోగుల బదిలీలు ఏకపక్షంగా జరిగాయని విమర్శలు వచ్చాయి. ఈసారి నిబంధనలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు.

28లోగా దరఖాస్తులు చేసుకోవాలి

బదిలీల కోసం దరఖాస్తు గడువు ఈనెల 28వ తేదీగా నిర్ణయించారు. దరఖాస్తులను జిల్లా పంచాయతీ అధికారులకు సమర్పించాలి. డీపీవోలు 29న నోడల్ అధికారికి వాటిని పంపిస్తారు. వచ్చే నెల 2వ తేదీలోగా కౌన్సెలింగ్, పోస్టింగ్‌ల ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

సిఫార్సు లేఖల కోసం హడావుడి

పోస్టింగ్ కోసం ఇంజినీర్లు, ఎంపీడీవోలు, సిబ్బంది సిఫార్సు లేఖల కోసం ప్రయత్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు పొందడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తమకు నచ్చిన పోస్టు కోసం పైరవీలు కూడా చేస్తున్నారు.

ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు..

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండేళ్లు పనిచేసిన ఉద్యోగులను ఏజెన్సీ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు. అలాగే, ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఏజెన్సీలో పనిచేయాలనే నిబంధన కూడా ఉంది. ఎక్కువ కాలం ఏజెన్సీలో పనిచేస్తున్న వారిని మైదాన ప్రాంతాలకు బదిలీ చేయనున్నారు.

సొంత డివిజన్‌లో 'నో'

పంచాయతీరాజ్‌లో సొంత డివిజన్ లేదా సొంత మండలంలో పనిచేయడానికి నిబంధనలు అడ్డువస్తున్నాయి. అలాగే 9 సంవత్సరాలు ఒకే స్థలంలో పనిచేసిన ఉద్యోగ సంఘాల నాయకులను బదిలీ చేయకూడదు.

పబ్జిగేమ్ ఆడొద్దన్నందుకు మనస్తాపంతో..

- ఇంటి నుంచి పారిపోయిన విద్యార్థి
- టూటౌన్ పోలీసులకు చిక్కిన యువకుడు
- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



విద్యార్థినిని అతని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు తదితరులు

అల్లిపురం: పబ్జీ గేమ్స్ ఆడవద్దని తండ్రి మందలించడంతో ఓ యువకుడు ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపిన వివరాల ప్రకారం, ఏలూరు జిల్లా..ఉంగుటూరుకు చెందిన ఐటీఐ విద్యార్థి.. పబ్జీ గేమ్స్‌కు బానిస కావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న తండ్రి వెంప శివకుమార్ ఏలూరు పరిసర ప్రాంతాలలో వెతికినా అతని ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆయన నిడమర్రు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సదరు విద్యార్థి ఒక వ్యక్తి సెల్ నుంచి తాను హైదరాబాద్‌లో ఉన్నట్లు తండ్రి సెల్‌కు మెసేజ్ పెట్టాడు. ఆ ఫోన్ నంబరు ఆధారంగా నిడమర్రు పోలీసులు సాంకేతికత ద్వారా విద్యార్థి విశాఖలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో విశాఖ చేరుకున్న తల్లిదండ్రులు టూటౌన్ పోలీసులను సంప్రదించారు. ఎస్.ఐ ఎన్. సింహాచలం, హెచ్‌సీ టీ. శ్రీనివాసరాజు సహకారంతో గాలించగా సదరు విద్యార్థి కల్లుపాకల వద్ద ఉన్నట్లు గుర్తించారు. అతడిని తీసుకువచ్చి సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

పాడేరు మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేయాలి

మహారాణిపేట: పాడేరు మెడికల్ కాలేజీ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, సిబ్బందిని నియమించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వేదిక ప్రధాన కార్యదర్శి అజ శర్మ లేఖ రాశారు. కళాశాల నిర్మాణం నత్తనడకన సాగుతోందని, సరైన వసతులు లేక మొదటి బ్యాచ్‌లో తక్కువ మంది విద్యార్థులే చేరారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉందని, ఉన్నవారికి సరైన వసతి లేదని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నాటికి నిర్మాణాలు పూర్తి చేసి, పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు.

దిగుబడి బాగు.. ధర దిగాలు!

- మామిడి పళ్లతో కళకళలాడుతున్న మార్కెట్లు
- విశాఖ జిల్లా వ్యాప్తంగా 27 వేల హెక్టార్లలో మామిడి తోటలు
- ఈ ఏడాది హెక్టార్‌కు సగటున 10 టన్నుల వరకు దిగుబడి
- రైతుబజార్లలో కిలో మామిడి పళ్ల సగటు ధర రూ.45





పెందుర్తి రైతు బజార్‌లో మామిడి పండ్ల అమ్మకాలు

పెందుర్తి: విటమిన్లు, ఖనిజాలు, పీచు పదార్థాల కలయికే మామిడి పండు.. మనిషి ఆరోగ్యానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తుంది. అందుకే మామిడిని పండ్లలో రారాజు అని అంటారు. రంగు, రుచి, సువాసనలతో మనల్ని ముగ్ధులను చేస్తుంది. జిల్లాలో ఈ ఏడాది మామిడి సీజన్ ఊపందుకుంది. జిల్లా వ్యాప్తంగా మార్కెట్లు, రైతు బజార్లు మామిడి సువాసనలతో నిండిపోయాయి. రైతులు, వ్యాపారులు అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించడంతో మామిడి దిగుబడి గణనీయంగా పెరిగింది. జిల్లాలో మామిడి తోటలకు ప్రసిద్ధి చెందిన పద్మనాభంతో పాటు ఆనందపురం, పెందుర్తి, భీమిలి ప్రాంతాల్లో పంట పూర్తిస్థాయిలో పక్వానికి వచ్చింది. రైతులు ఇప్పటికే మామిడి కాయలను దించి విక్రయాలు సాగిస్తున్నారు. అయితే, దిగుబడి పెరిగినప్పటికీ, దానికి తగ్గట్టుగా ధరలు పలకకపోవడంతో మామిడి రైతులు కొంత నిరాశలో ఉన్న మాట వాస్తవం. మరోవైపు గత ఏడాదితో పోలిస్తే ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలు, పంచదార కంచెలు, పండూరి, కలెక్టర్, కొబ్బరి మామిడి, పనుకూలు, కోలంగోవ, పరియా, నీలాలు వంటి వివిధ రకాల మామిడి పండ్ల రుచిని ఆస్వాదిస్తున్నారు.

ఎకరాకు సగటున 4 టన్నులు

జిల్లాలోని గ్రామీణ మండలాలైన పద్మనాభం, ఆనందపురం, భీమిలి, పెందుర్తిలలో మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. ఈ ఏడాది సుమారు 27 వేల హెక్టార్లలో(దాదాపు 67 వేల ఎకరాలు) మామిడి పండింది. డిసెంబర్, జనవరిలో పూత దశలో పొగమంచు ప్రభావం, రెండు మూడు తుఫాన్ల కారణంగా సుమారు 50 శాతానికి పైగా పంట దెబ్బతింది. అయినప్పటికీ రైతులకు 40–45 శాతం ఫలసాయం దక్కింది. ఇది ఏటా వచ్చే సగటు ఫలసాయంతో పోలిస్తే మెరుగైన దిగుబడే. సీజన్ ముగిసే సమయానికి హెక్టార్‌కు సగటున 10 టన్నుల వరకు దిగుబడి రావచ్చని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో మామిడి ధర రూ.50–60 పలుకుతుండగా.. రైతు బజార్లలో సగటున రూ.45గా నిర్ణయించారు. కొందరు రైతులు నిర్ణయించిన ధర కంటే రూ.5–10 తక్కువకే విక్రయిస్తున్నారు.



మామిడిపళ్లను కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు

దిగుబడి ఉన్నా ధరలు లేవు



మాకు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. అందులో బంగినపల్లి, సువర్ణరేఖ జాతులు అధికంగా ఉన్నాయి. మొదట్లో పూత చాలా బాగా వచ్చింది. అయితే పొగమంచు అధికంగా పడడంతో పాటు వర్షాలు కూడా మమ్మల్ని దెబ్బకొట్టాయి. అయినా గతేడాదితో పోల్చితే దిగుబడి బాగానే వచ్చింది. కానీ ఆశించిన స్థాయిలో ధరలు లేవు. వచ్చినంతలో రైతుబజార్‌కు వచ్చి అమ్ముకుంటున్నాం. మాకు లాభం లేకపోయినా ప్రజలైనా మంచి మామిడి పండ్లు తినాలనే ఉద్దేశంతో ఒక్కోసారి నిర్ణయించిన ధర కంటే తక్కువకే ఇచ్చేస్తున్నాం.

– గొర్లి అప్పలనాయుడు, ఆర్లి, కె.కోటపాడు

కష్టానికి తగ్గ ధర వస్తే చాలు



మా దగ్గర నాలుగు ఎకరాల తోట ఉంది. దాంతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. ఈ ఏడాది మొదట్లో వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి ఆశించినంతగా లేదు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈసారి బాగానే పండింది. మా తోటలో సగానికి పైగా దించేశాం. పంట నిలబెట్టుకోవడానికి చాలా ఖర్చు పెట్టాం. సీజన్ పూర్తయ్యేసరికి కనీసం నష్టం రాకుండా ఉంటే చాలని అమ్మకాలు చేస్తున్నాం. –నాగిరెడ్డి అప్పలనాయుడు, కె.కోటపాడు

మేలు రకం అయితేనే ఆసక్తి చూపుతున్నారు



మేం మూడు ఎకరాల్లో కొన్ని ముఖ్యమైన మామిడి రకాలు వేశాం. నాలుగేళ్ల నుంచి పంట వస్తుంది. పోయిన ఏడాది చాలా నష్టపోయాం. కానీ ఈ ఏడాది దిగుబడి మెరుగుపడింది. అయితే బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలే ప్రజలు ఎక్కువ అడుగుతున్నారు. వారికి కావాల్సిన రకాలు సమకూర్చి అందిస్తున్నాం. ఈ ఏడాది భారీగా లాభాలు వచ్చే అవకాశం లేదు.

– చప్పా సన్యాసమ్మ, అడ్దూరు, చొడవరం మండలం

ధరలు అందుబాటులో ఉన్నాయి



సీజన్ ఊపందుకోవడంతో అన్ని రకాల మామిడి పండ్లు దొరుకుతున్నాయి. ఇప్పటివరకు రైతు బజార్‌లో ఐదారు సార్లు కొనుగోలు చేశాను. మా బంధువులు, మిత్రులకు కూడా ఇక్కడే తీసుకోమని సూచిస్తున్నారు. బయటి మార్కెట్‌తో పోల్చితే రైతుబజార్‌లో రూ.20 వరకు తక్కువగానే వస్తున్నాయి. ఏ రకం పళ్లు అయినా సగటున రూ.40–45కి అందిస్తున్నారు. గతేడాదితో పోల్చితే ఇది చాలా మెరుగైన ధర. – శాస్త్రి, పెందుర్తి, వినియోగదారుడు

ఇథలిన్‌తోనే పళ్లు మగ్గబెట్టాలి



సీజన్ ఊపందుకోవడంతో జిల్లాలో రైతులు మామిడి దింపుడు కార్యక్రమం ముమ్మరం చేశారు. ఈ క్రమంలో పక్వానికి వచ్చిన మామిడిని తగిన జాగ్రత్తలు తీసుకుని మగ్గబెట్టాలి. మామిడి పండ్లను కాల్షియం కార్బేట్ సహాయంతో మగ్గబెట్టడం మంచిది కాదు. దీని వలన ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. పక్వానికి వచ్చిన మామిడి పళ్లను ఇథలిన్ వాయువు సహాయంతో మగ్గబెడితే ఆరోగ్యానికి ఎటువంటి ముప్పు ఉండదు. మామిడి కాయలను గాలి చొరబడని గదిలో ఉంచాలి. తర్వాత ఇథలిన్ వాయువును 2 పీపీహెచ్ మోతాదులో స్ప్రే చేసి 16 గంటల తరువాత తీయాలి. ఇలా చేస్తే రుచికరమైన, ఆరోగ్యకరమైన మామిడి పండ్లు లభిస్తాయి. లేదా బకెట్ నీటిలో ఇథలిన్ ద్రావణం, క్లాస్కిక్ సోడా కలిపి చల్లిన తర్వాత 24 గంటలు ఉంచాలి. దీని వలన ఇథలిన్ వాయువు విడుదలై మామిడి కాయలు మగ్గుతాయి.

– జి.సోని, ఉద్యానశాఖ అధికారి

కూటమి పాలనలో దళితులకు రక్షణ లేదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నాగ మల్లేశ్వరి



మాట్లాడుతున్న నాగ మల్లేశ్వరి

సాక్షి, విశాఖపట్నం: కూటమి పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచ నాగ మల్లేశ్వరి మండిపడ్డారు. దళిత హోం మంత్రి ఉన్నా దళితులపై దాడులు ఆగడం లేదని, స్వయంగా హోంమంత్రి సొంత నియోజకవర్గంలోనే దళితులను బహిష్కరించారని ఆమె ఆరోపించారు. మంగళవారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెనాలిలో దళిత యువకుడిపై పోలీసుల దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. 'దళిత యువకుడు తప్పు చేస్తే రోడ్డు మీద ఒక సీఐ కాలుతో తొక్కి, మరో సీఐ కర్రలు విరిగేలా అత్యంత పాశవికంగా కొడుతుంటే, ఇక చట్టాలు, న్యాయవ్యవస్థలు ఈ రాష్ట్రంలో ఎందుకు?' అని ఆమె ప్రశ్నించారు. మదనపల్లిలో దళితులపై దాడి, చిత్తూరులో టీడీపీ నేతల ముందు చెప్పులు వేసుకుని తిరిగారని, దళితుడి బైక్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టిన పరిస్థితులు చూశామని ఆమె అన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరిగినా, చిన్నారిపై లైంగికదాడులు జరిగినా స్పందించడం లేదని మండిపడ్డారు.

మోడల్ ఎంట్రన్స్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరం

విశాఖ విద్య: పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు మోడల్ ఎంట్రన్స్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరమని విద్యాశాఖ ఆర్జేడీ బీ. విజయ భాస్కర్ అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జూన్ 1న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న మోడల్ డీఎస్సీ పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను డీఈవో ప్రేమ్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మెగా డీఎస్సీకి సిద్ధమయ్యే అభ్యర్థులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు ఇలాంటి మోడల్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని డీఈవో ప్రేమ్ కుమార్ తెలిపారు. గోపాలపట్నం జెడ్పీహెచ్ఎస్, అనకాపల్లి ఎంజీహెచ్ఎస్, నర్సీపట్నం జెడ్పీహెచ్ఎస్, అలాగే పాడేరులో మోడల్ పరీక్షల కోసం కేంద్రాలు ఏర్పాటు చేశామని పీఆర్‌టీయూ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు డి. గోపీనాథ్, ఎం. శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న గంట్లా శ్రీనుబాబు

సీతంపేట: ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం ఆంధ్రా యూనివర్సిటీ ప్లాటినం జూబ్లీ హాల్–2 లో జరుగుతుందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తెలిపారు. అక్కయ్యపాలెంలోని ఒక హోటల్లో మంగళవారం జరిగిన ఫెడరేషన్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అన్ని జిల్లాల నుంచి 70 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్టు తెలిపారు. సమావేశంలో ఐదు తీర్మానాలు ప్రవేశపెట్టి రాష్ట్ర కార్యవర్గ ఆమోదం తీసుకుంటామన్నారు. జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ్ మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ల మంజూరు, ప్రమాద బీమా పునరుద్ధరణ, పెన్షన్ విధానం వంటి పలు అంశాలపై చర్చిస్తామని తెలిపారు.

నేడు ఎన్టీఆర్ జయంతి

మహారాణిపేట: మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్.టి.రామారావు జయంతిని ఈనెల 28న రాష్ట్ర పండగగా జరపాలని ప్రభుత్వం ఆదేశించినట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో బుధవారం ఉదయం 10 గంటలకు జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

చెక్ బౌన్స్ కేసులో రియల్ ఎస్టేట్ వ్యాపారికి జైలు

విశాఖ లీగల్: తన ఖాతాలో తగినంత డబ్బు లేకుండా చెక్కును జారీ చేసి నిరాదరణకు కారణమైన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ఏడో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.విశ్వనాథం మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుకు ఇవ్వవలసిన రూ. 42 లక్షలు, అలాగే రూ. 5వేలు ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు. ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది ముళ్లపూడి కళ్యాణ చక్రవర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ప్రముఖ డాక్టర్ సుధాకర్ పట్నాయక్ భీమిలి సమీపంలోని భూమి కొనుగోలు చేయడానికి ప్రయత్నించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి వి. గుప్తేశ్వరరావు తన వద్ద భూమి ఉందని నమ్మబలికాడు. నవంబర్ 2022లో రూ. 42 లక్షలు..డాక్టర్ సుధాకర్ నుంచి తీసుకున్నాడు. నిందితుడు చాలాకాలం డబ్బులు ఇవ్వకుండా, లేని భూములు చూపిస్తూ డాక్టర్‌ను మోసం చేశాడు. భూమి లేదా తాను ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని డాక్టర్ సుధాకర్ కోరినప్పటికీ గుప్తేశ్వరరావు స్పందించలేదు. బాకీ తీర్చే నిమిత్తం గుప్తేశ్వరరావు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన రూ.42 లక్షల చెక్కును బాధితుడికి ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా, ఖాతాలో తగినంత డబ్బు లేని కారణంగా అది నిరాకరణకు గురైంది. నోటీసు జారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఫిర్యాదుదారు డాక్టర్ సుధాకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్: అతివేగంగా, నిర్లక్ష్యంగా లారీ నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు వల్లి నాగేశ్వరరావు లారీ డ్రైవర్. విశాఖలో ఉంటున్నాడు. మృతుడు కోరుకొండ అప్పలాచారి కూడా విశాఖకు చెందినవాడు. అప్పలాచారి వృత్తి రీత్యా వడ్రంగి పనిచేస్తుంటాడు. 2023 అక్టోబరు ఏడో తేదీన అప్పలాచారి విశాఖ నుంచి శ్రీకాకుళం పని మీద వెళ్లాడు. అక్కడ కార్పెంటర్ పని చేసి తిరిగి రాత్రి 9 గంటల సమయంలో నగరంలోని ఆదర్శనగర్ జంక్షన్ వద్ద సిగ్నల్ పడడంతో ఆగాడు. వెనుక నుంచి వస్తున్న లారీ ఆగకుండా అప్పలాచారి మోటార్ సైకిల్‌ను బలంగా ఢీ కొట్టి 200 మీటర్ల దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. వాహనం నడుపుతున్న అప్పలాచారి అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక ఉన్న వ్యక్తికి కూడా బలమైన గాయాలు తగిలాయి. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు ఆరిలోవ ఎస్ఐ బి. అరుణ్ కుమార్ కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. పరిహారం కోసం నగరంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థను ఆశ్రయించాలని న్యాయమూర్తి తమ తీర్పులో సూచించారు.

రోడ్డు ప్రమాదంలో పీఎఫ్ కార్యాలయ ఉద్యోగి మృతి



మృతుడు నరేష్ బాబు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో సూపరిండెంట్‌గా పనిచేస్తున్న పి.వి. నరేష్ బాబు (60) మంగళవారం సాయంత్రం ఎన్ఏడీ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సాయంత్రం పీఎఫ్ కార్యాలయం నుంచి విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై పెందుర్తిలోని ఇంటికి వెళ్తుండగా ఓ కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను విచారించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎయిర్‌పోర్ట్ సీఐ ఉమామహేశ్వరరావు నేతృత్వంలో ఎస్ఐ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

కేఎంఆర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



పీఎంపాలెంలో కేఎంఆర్ కళాశాల బాలికల బ్రాంచ్ వద్ద నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

మధురవాడ: ఫేక్ హాల్ టికెట్లు ఇచ్చి విద్యార్థులను మోసం చేసిన కేఎంఆర్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కార్యదర్శి యు. నాగరాజు డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ఐదుగురు విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆర్ఐవో సమగ్ర విచారణ జరిపించాలని, బాధిత విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. ప్రైవేట్ కళాశాలలు విద్యను వ్యాపారంగా మార్చేశాయని ఆయన విమర్శించారు.

ఏబీవీపీ నిరసన : కేఎంఆర్ కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఐదుగురు విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఎంసెట్ ఆశలు నీరుగారిపోవడంతో మంగళవారం కళాశాల వద్ద వారు నిరసన తెలిపారు. ప్రైవేట్ కళాశాలల ఇష్టారాజ్య పాలనను అధికారులు పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆర్ఐవోను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.